వన్య ప్రపంచం.. దారులు ఘోరం


ఇందిరాగాంధీ జూ పార్కు


జూలో చింపాంజీలు, చిరుతల ఎన్‌క్లోజర్ల వైపు శిథిలమైన బీటీ రోడ్డు


కోతుల జోన్ వద్ద పలకలు చెదిరిపోయిన పాత్‌వే


అడవి కుక్కల ఎన్‌క్లోజర్‌కు వెళ్లే దారిలో విరిగిన పాత్‌వే గోడలు

- జూ పార్కులో రోడ్లు, పాత్‌వేలు శిథిలం
- నడకకు ఇబ్బంది పడుతున్న సందర్శకులు
- రహదారుల అభివృద్ధిని మరచిన జూ అధికారులు

ఆరిలోవ: వన్యప్రాణుల ప్రపంచమైన ఇందిరా గాంధీ జూ పార్కులో రహదారులు శిథిలమయ్యాయి. పాత్‌వేలు విరిగి వాటి పలకలు చెదిరిపోయాయి. ప్రతి రోజు వేల సంఖ్యలో సందర్శకులు జూ పార్కుకు వెళ్తుంటారు. ఇక్కడి వన్యప్రాణులను చూసేందుకు ఎన్‌క్లోజర్లకు వెళ్లే దారిలో కొన్ని రోడ్లు పాడయ్యాయి. వాటిపై నడవడానికి సందర్శకులు ఇబ్బంది పడుతున్నారు. ఇందిరాగాంధీ జూ పార్కు సహజ సిద్ధమైనది. పూర్తిగా ఇది రిజర్వ్‌డ్ ఫారెస్ట్‌లో ఒక భాగం. నిజానికి ఇక్కడ కాంక్రీట్‌కు సంబంధించిన పనులు చేపట్టకూడదు. అయినప్పటికీ సందర్శకుల సౌలభ్యం కోసం జూ పార్కు ఏర్పాటు చేసినప్పుడే అటవీ శాఖ అధికారులు దీని లోపల రోడ్లు, పాత్‌వేలు నిర్మించారు. ఎన్‌క్లోజర్ల వద్ద ప్రత్యేకంగా సీసీ రోడ్లతో పాత్‌వేలు ఏర్పాటు చేశారు. వీటితోపాటు వన్యప్రాణుల కోసం నైట్‌క్రాల్స్, డే క్రాల్స్ నిర్మించారు. ఇవి ఇప్పుడు కొన్నిచోట్ల శిథిలావస్థకు చేరాయి. సందర్శకులు ఎక్కువగా తిరిగే ప్రాంతాల్లోనే ఇవి మరమ్మతులకు గురైనా అధికారులు పట్టించుకోకపోవడం విశేషం.

ఎన్‌క్లోజర్ల వద్ద నడవలేం..

రెండేళ్లలో జూ అధికారులు సుమారు రూ.3 కోట్లు ఖర్చు చేసి కొత్త ఎన్‌క్లోజర్ల నిర్మాణం, కొన్ని మరుగుదొడ్ల నిర్మాణం, బయోస్కోప్ ఆధునికీకరణ, జూ లోపల సుమారు మూడున్నర కిలోమీటర్లు ప్రధాన రహదారికి మరమ్మతులు చేపట్టి బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. అవన్నీ నిర్మించి అత్యవసరమైన ఎన్‌క్లోజర్ల ముందు సందర్శకులు నడిచే రహదారులను వదిలేయడం విశేషం. ఈ రోడ్లతో పాటు వాటి పక్కన పాత్‌వేలపై అమర్చిన పలకలు ఊడిపోయి చెదిరిపోయాయి. వాటి గోడలు విరిగిపోయాయి. కోతుల జోన్, ఏనుగుల ఎన్‌క్లోజర్, అడవి కుక్కల ఎన్‌క్లోజర్, చింపాంజీ, చిరుతలు ఎన్‌క్లోజర్లు, ప్రాంతాల్లో రహదారులు పూర్తిగా శిథిలమయ్యాయి. రాళ్లు తేలిన ఆ రహదారులపై సందర్శకులు నడవలేని పరిస్థితికి నెలకొంది. ఈ రోడ్లను అభివృద్ధి చేయకుండా వదిలేయడందో జూ అధికారులపై సందర్శకులు మండిపడుతున్నారు.

కార్తీక మాసంలో రద్దీ

కార్తీక మాసంలో జూ పార్కు నిత్యం సందర్శకులతో రద్దీగా మారుతుంది. ఆ సమయాన్ని దృష్టిలో పెట్టుకొని జూ అధికారులు శిథిలమైన రహదారులకు మోక్షం కలిగించాలని స్థానికులు, సందర్శకులు కోరుతున్నారు. కార్తీక మాసంలో నగరంతో పాటు వివిధ జిల్లాల నుంచి ప్రతి రోజూ వేలల్లో జూ పార్కును సందర్శిస్తుంటారు. జూ లోపల ప్రధాన రహదారి కార్లతో నిండిపోతుంది. నడవడానికి పాత్‌వేలు, ఎన్‌క్లోజర్లను ఆనుకొని ఉన్న రోడ్లను మాత్రమే వినియోగించాల్సి వస్తోంది. వాటికి కనీసం మరమ్మతులైనా చేపడితే సౌలభ్యంగా ఉంటుందని సందర్శకులు భావిస్తున్నారు. అధికారులు ఇక్కడ రహదారుల ఆధునికీకరణపై దృష్టిపెట్టాలని వారు కోరుతున్నారు.

దీపావళి వేడుకల్లో జాగ్రత్తలు తప్పనిసరి

ఆరిలోవ: దీపావళి వేడుకల్లో ప్రజలు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని ఎల్వీ ప్రసాద్ కంటి వైద్యశాల ఆప్తమాలజిస్ట్ డాక్టర్ శిల్ప తరిణి తెలిపారు. ఆస్పత్రిలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఎంతో ఆనందంగా జరుపుకొనే దీపావళి సందర్భంగా టపాసులు కాల్చేటప్పుడు కంటితో పాటు శరీరానికి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముందుగా కొనుగోలు చేసిన టపాసులను ఇంట్లో భద్రపరచేటప్పుడు పిల్లలకు దూరంగా ఉంచాలని సూచించారు. పిల్లలు టపాసులు కాల్చుతున్నప్పుడు వారిని పెద్దలు పర్యవేక్షించాలని, వాటిని కాల్చేటప్పుడు పొడవైన కొవ్వొత్తిని వినియోగించాలన్నారు. కంటికి తప్పనిసరిగా నల్లని కళ్లద్దాలు పెట్టుకోవాలని, టపాసులు వెలిగించే సమయంలో సింథటిక్ దుస్తులు కాకుండా.. మందంగా, బిగుతుగా ఉండేవి ధరించాలని సూచించారు. పొరపాటున టపాసులు వల్ల ఏదైనా ప్రమాదానికి గురైతే వెంటనే అందుబాటులో ఉన్న వైద్యులను సంప్రదించాలన్నారు. కంటికి గాయమైతే దానిపై ఎలాంటి ఒత్తిడి లేకుండా చూడాలన్నారు. కన్ను నలపకుండా వైద్యులను సంప్రదించాలని డాక్టర్ శిల్ప తరిణి సూచించారు.

బాణసంచా స్టాళ్ల నిర్మాణం

ఎంవీపీకాలనీ: బాణసంచా విక్రయాల్లో భాగంగా ఎంవీపీ కాలనీ ఏఎస్ రాజా మైదానంలో స్టాళ్ల నిర్మాణం శరవేగంగా సాగుతోంది. ఏటా మాదిరిగానే ఈ ఏడాది ఇక్కడ బాణసంచా విక్రయాలకు అధికారులు అనుమతులు ఇవ్వడంతో వ్యాపారులు పెద్ద ఎత్తున స్టాళ్లు నిర్మాణం చేపట్టారు. ఏఎస్ రాజా మైదానం చుట్టూ స్టాళ్లు ఏర్పాటు చేస్తుండగా, మైదానం మధ్యలో ప్రాంతాన్ని వాహనాల పార్కింగ్ కోసం కేటాయించారు. ఈ ఏడాది 32 స్టాళ్ల ద్వారా దీపావళి సామగ్రి విక్రయాలు జరగనున్నట్లు వ్యాపారులు తెలిపారు. ఆయా ఏర్పాట్లను జీవీఎంసీ, పోలీసు విభాగం అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

క్లుప్తంగా

విమ్స్‌లో నేడు ఉచిత వైద్య శిబిరం

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో మంగళవారం న్యూరో విభాగానికి సంబంధించి ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. వరల్డ్ స్ట్రోక్ డే సందర్భంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓపీ బ్లాక్‌లో శిబిరం జరుగుతుందన్నారు. బ్రెయిన్ స్ట్రోక్, నరాల సమస్యలు, మూర్ఛ వ్యాధి, తలనొప్పి, పక్షవాతం, చిన్న పిల్లలకు మానసిక వైకల్యం తదితర రోగాలను నిర్ధారించే పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అవసరమైన వారికి ఉచిత వైద్య పరీక్షలు చేయడంతోపాటు మందులు పంపిణీ చేస్తామన్నారు. న్యూరో మెడిసిన్‌కు సంబంధించిన చికిత్సలు కూడా ఉచితంగా చేయనున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని అవసరమైన వారు సద్వినియోగపరుచుకోవాలని విమ్స్ డైరెక్టర్ కోరారు.

ఆధునిక ప్రయోగశాల ప్రారంభం


ప్రయోగశాలను ప్రారంభిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగం విద్యార్థులకు ఉపయుక్తంగా అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆధునికీకరించిన ప్రయోగశాలను సోమవారం ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు ప్రారంభించారు. అరబిందో ఫార్మా వైస్ చైర్మన్, ఎండీ కె.నిత్యానందరెడ్డి, డైరెక్టర్ పి.శరత్‌చంద్రారెడ్డిల సహకారంతో ఈ ల్యాబొరేటరీని ఆధునికీకరించారు. అరబిందో ఫార్మా సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.20 లక్షలు, ఏయూ రసాయన శాస్త్ర విభాగం(ఫుడ్స్, డ్రగ్స్ అండ్ వాటర్ అనాలసిస్) 1990–92 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు రూ.8 లక్షలతో ప్రయోగశాలను తీర్చిదిద్దారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనంజయరావు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, అరబిందో కార్పొరేట్ క్వాలిటీ విభాగాధిపతి డాక్టర్ కె.రామ శ్రీనివాస్, హెచ్ఆర్ మేనేజర్ కమలాకర్ రెడ్డి, విభాగాచార్యులు టి.శివరావు, వి.సిద్ధయ్య, జి.వేంకటేశ్వరరావు, విభాగాధిపతి పి.శ్యామల, డీన్ కె.బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

తీరంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

బీచ్‌రోడ్డు: సాగర తీరానికి గుర్తు తెలియని ఒక వ్యక్తి మృతదేహం కొట్టుకొచ్చింది. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా.. సోమవారం ఉదయం 10 గంటల సమయంలో పాండురంగపురం ఎదురుగా ఉన్న సముద్ర తీరం వద్ద ఒక వ్యక్తి మృతదేహం తేలుతూ సందర్శకులకు కనిపించింది. వారు అక్కడే ఉన్న జీవీఎంసీ సిబ్బందికి తెలియజేయగా.. పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకొచ్చి కేజీహెచ్ మార్చురీకి తరలించారు. అక్కడ మృతదేహాన్ని గుర్తించిన వారు మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు కోరారు.

రోడ్డుపైనే సామగ్రి


పిఠాపురం కాలనీ రోడ్డుపై వేసిన భవన నిర్మాణ సామగ్రి

బీచ్‌రోడ్డు: అందరూ రాకపోకలు సాగించే రహదారిపై భవన నిర్మాణ సామగ్రి వేయడంతో సమస్యాత్మకంగా మారింది. 22వ వార్డు పిఠాపురం కాలనీలోని ప్రధాన రహదారిని ఆక్రమించి ఇసుక, ఇటుక, పిక్క, కాంక్రీట్, ఇనుము వంటి సామగ్రి వేసి పనులు సాగిస్తున్నారు. అటుగా వెళ్లే వాహనాలకు, పాదచారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇసుక వల్ల కొన్ని సార్లు వాహనాలు జారి కింద పడుతున్నాయి. చోదకులు గాయపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఆకట్టుకున్న దీపావళి ప్రమిదలు


దివ్యాంగ విద్యార్థులు తయారు చేసిన ప్రమిదలను తిలకిస్తున్న సివిల్ జడ్జి వెంకట శేషమ్మ తదితరులు

ఎంవీపీకాలనీ: దీపావళి పండగను పురస్కరించుకొని ఎంవీపీ కాలనీ హిడెన్‌స్ప్రౌట్స్ మానసిక దివ్యాంగ పాఠశాల విద్యార్థులు తయారు చేసిన ప్రమిదలు ఆకట్టుకున్నాయి. కొన్ని రోజులుగా వివిధ రంగులు, ఆకృతుల్లో వారు రూపొందించిన ప్రమిదలను సోమవారం ప్రదర్శించారు. స్కూల్ పేరు ఆకారంలో పేర్చి ప్రదర్శించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి జిల్లా సివిల్ జడ్జి, లీగల్ సర్వీసెస్ అథారటీ కార్యదర్శి ఎం.వెంకట శేషమ్మ ఈ ప్రమిదలను తిలకించి ఆనందం వ్యక్తం చేశారు. దివ్యాంగ విద్యార్థులను ఆమె అభినందించారు. పర్యావరణ హితంగా ప్రతి ఒక్కరూ దీపావళి జరుపుకోవాలని సూచించారు. పాఠశాల వ్యవస్థాపకుడు కండిపిల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ కాలుష్య రహిత దీపావళిపై అవగాహన పెంచేందుకే దివ్యాంగ విద్యార్థులతో ఏటా మట్టి ప్రమిదలు తయారు చేయిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల నిర్వహణ కోసం సాయం అందిస్తున్న దాతలు, శ్రేయోభిలాషులకు ఈ ప్రమిదలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలమాంబ ఆలయ హుండీ ఆదాయం రూ.7.47 లక్షలు


హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

బీచ్‌రోడ్డు: పెదవాల్తేరు కరకచెట్టు పోలమాంబ అమ్మవారి ఆలయ హుండీల ద్వారా రూ.7,47,607 ఆదాయం వచ్చినట్లు ఈవో గాయత్రి తెలిపారు. సోమవారం దేవదాయ శాఖ పర్యవేక్షణ అధికారి పి.ఎస్.ఎన్.మూర్తి సమక్షంలో పెదవాల్తేరు గ్రామ సేవ సంఘం అధ్యక్షుడు చిల్లా రామారావు, త్రీ టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో ఆదాయం లెక్కించారు.

వృక్ష సంరక్షణతోనే జీవ మనుగడ


మొక్క నాటి నీరు పోస్తున్న ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు

విశాఖ సిటీ: వృక్షాలను సంరక్షిస్తేనే జీవుల మనుగడ సాధ్యపడుతుందని ఆంధ్రా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు పేర్కొన్నారు. వృక్ష శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఏయూ బొటానికల్ గార్డెన్‌లో రిజిస్ట్రార్ మొక్కలు నాటి మాట్లాడారు. విశ్వవిద్యాలయంలో వృక్ష సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యమిస్తామని చెప్పారు. నగరంలో అతిపెద్ద హరిత ప్రాంగణంగా ఏయూ నిలుస్తోందన్నారు. మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం మనందరి బాధ్యతని సూచించారు. ఈ సందర్భంగా బొటానికల్ గార్డెన్‌లో అవకాడో, లక్ష్మణ ఫలం, మల్బరీ, లిచీ, మామిడి, ఇతర పండ్ల మొక్కలు నాటారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, బోటనీ విభాగాధిపతి సంధ్య దీపిక, అకడమిక్ డీన్ కె.ఈశ్వర్‌కుమార్, విభాగ ఆచార్యులు ఎస్.బి.పడాల్, సుజాత, వెంకయ్య పాల్గొన్నారు.

ఓటు హక్కుపై విద్యార్థులకు అవగాహన


ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న రూరల్ తహసీల్దార్ పాల్ కిరణ్

ఎంవీపీకాలనీ: స్థానిక వీఎంసీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ వింగ్ ఆధ్వర్యంలో సోమవారం ఓటు హక్కుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులు విశాఖ రూరల్ తహసీల్దార్ పాల్ కిరణ్, డిప్యూటీ తహసీల్దార్ యామిని విద్యార్థులకు ఓటు హక్కు ప్రాధాన్యాన్ని వివరించారు. తన ఓటే తన భవిష్యత్‌ను నిర్దేశిస్తుందనే విషయాన్ని ప్రతి విద్యార్థి గుర్తుంచుకోవాలన్నారు. రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టడంలో ఓటు చాలా కీలకమన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేయించుకుని మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకోవచ్చని చెప్పారు. ఎన్నికల్లో తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఎంసీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి.అప్పారావు, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌పై ట్రాఫిక్ ఐలాండ్



సీతకొండ కూడలి వద్ద ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన ట్రాఫిక్ ఐలాండ్

ఆరిలోవ: విశాలమైన రహదారుల పక్కన పాదచారుల కోసం ప్రత్యేకంగా ఫుట్‌పాత్‌లు నిర్మిస్తారు. రోడ్లపై వెళ్లే వాహనాల వల్ల ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఇవి పాదచారులకు సౌలభ్యంగా ఉంటాయి. ట్రాఫిక్ పోలీసులు కూడా 'పాదచారులు ఫుట్‌పాత్‌లపై మాత్రమే నడవాలి. కూడళ్లలో జీబ్రా క్రాసింగ్ గీతలపైనే నడిచి రోడ్డు దాటాలి. అలాంటప్పుడే సురక్షితంగా ఇంటికి చేరగలుగుతారు' అనే నినాదాలు ఇస్తుంటారు. అంతవరకు ట్రాఫిక్ పోలీసుల తీరు బాగానే ఉన్నా.. వారే ఆ నియమ నిబంధనలను పక్కన పెడుతుండటం విశేషం.

గతేడాదిలో జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ అధికారులు అటు బీచ్ రోడ్డుతోపాటు ఇటు విశాఖ వ్యాలీ స్కూల్ రోడ్డును విస్తరించారు. అవి కలిసే సీతకొండ మలుపు వద్ద కూడలి ఏర్పడింది. ఇక్కడ రోడ్ల పక్కన పాత్‌వేలు కూడా నిర్మించారు. ఈ కూడలి వద్ద బీచ్ రోడ్డులో ఫుట్‌పాత్‌పై పాదచారులు నడవడానికి వీలు లేకుండా ట్రాఫిక్ పోలీసులు ఐలాండ్ ఏర్పాటు చేసేశారు. ఈ ట్రాఫిక్ ఐలాండ్ అడ్డంగా ఉండటంతో పాదచారులు కూడలిలో రోడ్డు మీదకు దిగాల్సి వస్తోంది. ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులే ఇలా ఫుట్‌పాత్‌ను ఆక్రమిస్తే ఎలా అంటూ పలువురు విమర్శిస్తున్నారు. ట్రాఫిక్ ఐలాండ్‌కు ఎదురుగా ఫుట్‌పాత్‌పైనే ఓ చిరు వ్యాపారి జ్యూస్ విక్రయించే తోపుడు బండి పెట్టాడు. దీంతో ఇక్కడ రెండు వైపులా పాదచారులకు ఇబ్బందిగా మారింది.

విద్యార్థులకు ఫిట్‌నెస్ అవసరం


ఫిట్ ఇండియా రన్ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న కంసా బానిక్ తదితరులు

బీచ్‌రోడ్డు: విద్యార్థులకు రోజువారీ జీవనంలో ఫిట్‌నెస్ చాలా అవసరమని ఐఐపీఈ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ అధ్యక్షుడు ప్రొఫెసర్ పరితోష్ కంసా బానిక్ అన్నారు. ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్ 5.0 ముగింపు కార్యక్రమాన్ని సోమవారం ఐఐపీఈ క్యాంపస్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమాజ శ్రేయస్సు కోసం వివిధ అంశాలపై నిర్వహిస్తున్న కార్యక్రమాలు ఎంతో ప్రేరణ కలిగిస్తున్నాయన్నారు. ఆరోగ్యకరమైన జీవన శైలిలో స్వచ్ఛత పాత్ర చాలా ముఖ్యమైనదని పేర్కొన్నారు. మన చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఐఐపీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ శాలివాహన్ మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రారంభించిన స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో విశాఖ నాలుగో స్థానంలో నిలువడంలో జీవీఎంసీ అధికారుల సేవలను కొనియాడారు. ముందుగా బీచ్ రోడ్డులో ఫిట్‌నెస్ వాకథాన్ నిర్వహించారు. కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ ఆర్.సోమన్నారాయణ, నోడల్ ఆఫీసర్ రంధి రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు సంఘీభావంగా ఫ్లాష్ మాబ్


వైఎంసీఏ వద్ద ఫ్లాష్ మాబ్‌లో డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

ఏయూక్యాంపస్: పోలీసుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని శ్రీ కాశ్యప్ డిగ్రీ కళాశాల విద్యార్థులు సోమవారం బీచ్ రోడ్డులోని వైఎంసీఏ వద్ద ఫ్లాష్ మాబ్ నిర్వహించారు. దేశ సేవలో, ప్రజలకు భద్రత కల్పిస్తూ ప్రాణాలు కోల్పోయిన పోలీసులను గుర్తుచేసుకుంటూ, వారికి నివాళులర్పిస్తూ సెల్యూట్ స్కిట్‌ను ప్రదర్శించారు. పలు సినీ గీతాలకు లయబద్ధంగా డ్యాన్స్ చేసి అలరించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ టి.ఆర్.ఎస్.వర్మ మాట్లాడుతూ పోలీసులు సమాజానికి చేస్తున్న సేవలను స్మరించుకోవాలన్నారు. వారి త్యాగాలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఎస్.నారాయణ మూర్తి, ప్రిన్సిపాళ్లు సత్యనారాయణ, జోత్స్న రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కళావిహీనంగా పార్కు


దసపల్లా హిల్స్ మార్గంలోని కూడలి పార్కులో కనుమరుగైన పచ్చదనం


పార్కులో ప్రూనింగ్ చేయని మొక్కలు

ఏయూక్యాంపస్: నిర్వహణకు నోచుకోక ఓ కూడలి పార్కు కళావిహీనంగా తయారైంది. ఆల్ ఇండియా రేడియో స్టేషన్ నుంచి దసపల్లా హిల్స్‌కు వెళ్లే మార్గంలోని ఈ కూడలి నేడు నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. గతంలో విశాఖలో జరిగిన జీ20 సదస్సు సమయంలో ఈ పార్కును పూర్తిస్థాయిలో సుందరంగా తీర్చిదిద్దారు. తరువాత దీని నిర్వహణ పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. లక్షల రూపాయలు వెచ్చించి ఇక్కడ నాటిన మొక్కలను ప్రస్తుతం పూర్తిగా గాలికొదిలేశారు. ఈ మొక్కలకు ప్రూనింగ్ చేయడం, సుందరంగా తయారు చేయడం ఎంతో అవసరం. పార్కులో వేసిన గ్రీన్ గ్రాస్, ఇతర పుష్పాలతో కనువిందు చేసిన మొక్కలు నేడు కనుమరుగయ్యాయి. వీటికి తగినంతా నీటి సరఫరా చేసి, ప్రూనింగ్ చేస్తే ఈ కూడలి ఎంతో సుందరంగా దర్శనమిస్తుంది. నిత్యం పర్యాటకులు, ప్రముఖులు ఈ మార్గంలోనే ప్రయాణిస్తుంటారు. జీవీఎంసీ అధికారులు దీనిపై దృష్టి సారించి, పార్కుకు పూర్వ వైభవం తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

జోన్-3కి రెండు ఫిర్యాదులు


పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహిస్తున్న జోన్-3 కమిషనర్ శివప్రసాద్

సీతమ్మధార: ఆశీలమెట్టలోని జీవీఎంసీ జోన్-3 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి రెండు ఫిర్యాదులను జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదులను అధికారులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదులు, వాటి పరిష్కార సమాచారాన్ని ఫిర్యాదుదారులకు ఎప్పటికప్పుడు అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గంగాధర్, డిప్యూటీ ఇంజినీర్ పద్మావతి, సహాయ వైద్యాధికారి డాక్టర్ భాస్కరరావు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ గోపన్న, యూసీడీ విభాగం అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎల్.రాము, ఆర్వో పైడిరాజు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి మధ్యలో గొయ్యి


త్రీ టౌన్ పీఎస్ - మద్దిలపాలెం రహదారి మధ్యలో ఏర్పడిన గుంత

ఏయూక్యాంపస్: స్థానిక మూడో పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి మద్దిలపాలేనికి వెళ్లే రహదారి మధ్యలో గొయ్యి ఏర్పడింది. రాత్రిళ్లు ఈ మార్గంలో ప్రయాణించే వారు ప్రమాదాల బారిన పడుతున్నారు. పగటి వేళల్లో ప్రయాణికులకు గుంత కనిపిస్తుండటంతో జాగ్రత్తగా వెళుతున్నారు. రాత్రి వేళల్లో వాహన చోదకులకు ఇది సరిగా కనిపించడం లేదు. దీంతో ద్విచక్ర వాహనాలు గుంతలో పడటం, కొందరు గాయపడటం జరుగుతున్నాయి. జీవీఎంసీ సిబ్బంది ఈ గుంతని పూడ్చాలని వాహన చోదకులు కోరుతున్నారు.